సాక్షి నిజామాబాద్

బుధవారం । 30 । అక్టోబర్‌ । 2024



బాబ్లీ గేట్ల మూసి వేత..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌కు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్‌ గేట్లను త్రి సభ్య కమిటీ పర్యవేక్షణలో మూసి వేశారు.

- 8లో ▸



మధ్యవర్తిత్వంతో పరిష్కారం..

కొలిక్కిరాని ఎన్నో సమస్యలు మధ్యవర్తిత్వంతో పరిష్కారమవుతాయని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.8 /20.7

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచుకురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌.. వేదికపై సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి, కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

ప్రజాభిప్రాయం మేరకే

రిజర్వేషన్ల ప్రతిపాదనలు

- బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌ వెల్లడి
- కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని, ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్‌ బహిరంగ విచారణ చేపడుతోందని చైర్మన్‌ నిరంజన్‌ అన్నారు. డిసెంబర్‌ 9లోగా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు హై కోర్టుకు నివేదిక అందజేస్తామన్నారు. నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జుక్కల్‌ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, వర్గీకరణ చేపట్టాలని ప్రధానంగా డిమాండ్‌ చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 128 వినతులు కమిషన్‌కు అందాయి.

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజాభిప్రాయం మేరకే రిజర్వేషన్లకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచుతామని బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌ అన్నారు. ప్రజల సలహాలు, సూచనలను, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వెల్లడయ్యే అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలను స్వీకరించేందుకు బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయ ప్రకాశ్, బాలలక్ష్మితో కూడిన బృందం మంగళవారం నిజామాబాద్‌ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బహిరంగ విచారణ, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. బీసీ సంఘాల నాయకులతోపాటు వివిధ వర్గాల వారు హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్‌కు అందించారు. మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. బహిరంగ విచారణ ప్రక్రియకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిర్దేశిత నమూనాలో అఫిడవిట్‌ తో కూడిన వినతులు కమిషన్‌కు సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా హెల్ప్‌ డెస్క్‌ లను ఏర్పాటు చేశారు.

• శాస్త్రీయ పద్ధతిలో..

రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రతిపాదనలను రూపొందించేందుకు బీసీ కమిషన్‌ కసరత్తు చేస్తోందని చైర్మన్‌ నిరంజన్‌ అన్నారు. కమిషన్‌ విధివిధానాలను ఆయన వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని, ఇందులో భాగంగా స్థానిక సంస్థల్లో ఆయా వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై అధ్యయనం కోసం బీసీ కమిషన్‌ బహిరంగ విచారణ చేపడుతోందన్నారు. బీహార్‌లో62 శాతం బీసీల జనాభా ఉందన్నారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయాలని అక్కడి ప్రభుత్వం భావించగా, ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరించిందన్నారు. కర్ణాటకలో సైతం సర్వే నిర్వహించినప్పటికీ గత దశాబ్ద కాలంగా నివేదికను వెల్లడించలేని స్థితి నెలకొందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. కుటుంబ సర్వేలో పూర్తి సమాచారం అందించేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కుల సంఘాల ప్రతినిధులను కోరారు. నవంబర్‌ 13వ తేదీ వరకు సర్వే పూర్తవుతుందని, అనంతరం ఆన్‌లైన్‌ లో డేటాను నిక్షిప్తం చేసి డిసెంబర్‌ 9 లోగా ప్రభుత్వానికి, రాష్ట్ర హైకోర్టుకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

• హెల్ప్‌డెస్క్‌లు

కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. బీసీ కమిషన్‌ కు విజ్ఞాపనలు సమర్పించేందుకు, బహిరంగ విచారణకు హాజరయ్యే వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, నిర్దేశిత నమూనాలో వినతులు అందించేలా సహకరించేందుకు హెల్ప్‌ డెస్క్‌లు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఉదయం జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న కమిషన్‌ బృందానికి కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతి రెడ్డి, జుక్కల్‌ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, వివిధ సంఘాల ప్రతినిధులు కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలిపారు. స్పెషల్‌ ఆఫీసర్‌ సతీశ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ విచారణలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు

128 విజ్ఞప్తులు

- స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్‌ కల్పించాలి
- రాజకీయ, విద్య, ఉద్యోగ ఆర్థిక, సామాజిక రంగాల్లో తోడ్పాటు నందించాలి
- జిల్లాలో బీసీ భవన్‌ నిర్మించాలి

నిజామాబాద్‌అర్బన్‌: బీసీ కమిషన్‌కు ఉమ్మడి జిల్లా నుంచి వినతులు వెల్లువెత్తాయి. నిజామాబాద్‌ నుంచి 102 , కామారెడ్డి నుంచి 26 వినతులు వచ్చాయి. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, వర్గీకరణ చేపట్టాలని ప్రధానంగా డిమాండ్‌ చేశారు.

రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ కులాల జనాభాను లెక్కించి ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ, ఉపాధి రంగాలలో వారి స్థితిగతులు తెలుసుకొని ఆయా రంగాలలో మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి బీసీ కమిషన్‌కు సమర్పించిన వినతిలో పేర్కొన్నారు. బీసీ కుల వృత్తులలో కొనసాగుతున్న వారు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా ప్రణాళికలు రచించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌ కల్పించాలన్నారు. ఇప్పుడున్న 23 శాతం రిజర్వేషన్‌ బీసీ జనాభాకు సరిపోదన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి

రూ. 20 వేల కోట్ల బడ్జెట్‌ కేటాయించాలి.

మున్నూరు కాపు ఇంటలెక్చువల్‌ ఫోరం సమర్పించిన నివేదికలో మున్నూరు కాపులకు 100 శాతం సబ్సిడీపై విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందిచాలన్నారు. భూమిలేని మున్నూరు కాపులకు మూడెకరాల భూమి ఇవ్వాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ పుప్పాల రవి, జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కెంపుల నాగరాజు తదితరులు ఉన్నారు. బీసీ కులగణన చేసి బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్‌ లక్ష్మీనారాయణ బీసీ కమిషన్‌ను కోరారు. వీరశైవ జంగమ కులస్తులు వారి స్థితిగతులు, రిజర్వేషన్ల వివరాలను బీసీ కమిషన్‌కు తెలియజేశారు. జంగమ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటునందించాలన్నారు.

స్టడీ సర్కిల్‌కు స్థలం కేటాయించాలి..

బీసీల అభ్యున్నతి, సంక్షేమంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమగ్ర వివరాలను సమర్పించింది. రాజకీయ, విద్య, ఉద్యోగ ఆర్థిక సామాజిక రంగాల్లో బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్‌ కేటాయించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు నాగరాజ్‌ కోరారు. జిల్లాలో బీసీ భవన్‌ నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రెండెకరాల స్థలం కేటాయించాలన్నారు. కాలేజీ హాస్టళ్లలో సీట్లను రెట్టింపు చేయాలన్నారు. కుల గణన సర్వే విజయవంతం చేస్తామన్నారు.

బురుడుగల్లీ సందర్శించిన బీసీ కమిషన్‌

- మేదరి కులస్తుల స్థితిగతుల పరిశీలన



మేదరి కులవృత్తిని పరిశీలిస్తున్న చైర్మన్‌ నిరంజన్, సభ్యులు

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ బీసీ కమిషన్‌ సభ్యుల బృందం మంగళవారం రాత్రి నిజామాబాద్‌ నగరంలోని బురుడుగల్లీ ప్రాంతాన్ని సందర్శించింది. స్థానికంగా దశాబ్దాల కాలం నుంచి నివాసం ఉంటున్న మేదరి కులస్తుల జీవన స్థితిగతులను క్షేత్రస్థాయి సందర్శన ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించారు. కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ మేదరి కులస్తులకు చెందిన ఒక్కో ఇంటిని సందర్శిస్తూ, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వెదురుతో తయారు చేసిన ఉత్పత్తులు పరిశీలించారు. మేదరి వృత్తిపై ఆధారపడిన తాము దుర్భర జీవితాలు వెళ్లదీస్తున్నామని, తమను ఇతర రాష్ట్రాల తరహాలో ఎస్‌టీ జాబితాలో చేర్చాలని, జీవనోపాధిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టేలా సిఫార్సు చేయాలని మేదరి కులస్తులు, ఆ సంఘం నాయకులు కోరారు. వారి అభ్యర్థనలపై కమిషన్‌ చైర్మన్, సభ్యులు సానుకూలంగా స్పందించారు. తాము పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదించి, ప్రత్యేక తోడ్పాటు అందించాల్సిందిగా సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు. కమిషన్‌ బృందం వెంట జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి, తహసీల్దార్‌ బాలరాజు ఉన్నారు.

న్యూస్‌రీల్‌

బాధ్యతలు స్వీకరించిన కార్పొరేషన్‌ కమిషనర్‌ దిలీప్‌



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌గా ఎస్‌.దిలీప్‌కుమార్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్‌ మల్కాజిగిరి జెడ్పీ సీఈవోగా విధులు నిర్వర్తిస్తున్న దిలీప్‌కుమార్‌ను ప్రభుత్వం కార్పొరేషన్‌ కమిషనర్‌గా బదిలీ చేసింది. నూతన కమిషనర్‌కు డిప్యూటీ కమిషనర్‌ రాజేంద్రకుమార్, అడిషనల్‌ కమిషనర్‌ శంకర్, మున్సిపల్‌ మేనేజర్‌ జనార్దన్, అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



కామారెడ్డి టౌన్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం కామారెడ్డిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. అండర్‌ 14 బాలబాలికల విభాగాలలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ప్రతిభ చూపినవారిని జిల్లా బాలబాలికల జట్లకు ఎంపిక చేసినట్లు స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి హీరాలాల్‌ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అనురాధ, విద్యాసాగర్, రాజేష్, స్వామిగౌడ్, భాస్కర్, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

39 మంది ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్‌అర్బన్‌: డీఎస్సీలో స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ విభాగంలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులు మంగళవారం పరిశీలించారు. స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ ఎస్జీటీ విభాగంలో 1:3 ప్రకారం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. మొదటి రోజు 39 మంది అభ్యర్థులు హాజరు తమ సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకున్నారు. మిగతా ఆరుగురి సర్టిఫికెట్లను పరిశీలను పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ తెలిపారు.

ప్రతి ఒక్కరి అభ్యున్నతి కోసమే సమగ్రసర్వే

- క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలి
- విదేశాల్లో ఉన్నవారి వివరాలు సైతం సేకరించాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీహనుమంతు, ఉన్నతాధికారులు

నిజామాబాద్‌అర్బన్‌: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి అభ్యున్నతి కోసమే ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్కతో కలిసి మంగళవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కుటుంబ సర్వే లక్ష్యా లు, విధివిధానాలు, కార్యాచరణను వివరించి సర్వే విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. సర్వే కోసం ఆయా బ్లాక్‌ల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి మాస్టర్‌ ట్రైనర్లతో శిక్షణ ఇప్పించాలన్నారు. 150 కు టుంబాలకు ఒక ఎన్యుమరేటర్, పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించాలని సూచించారు. సర్వేకు ప్రణాళిక శాఖ నోడల్‌ విభాగంగా వ్యవహరిస్తుందని, క్షేత్ర స్థాయిలో ప్రతి మండలానికి ఒక నోడల్‌ ఆఫీసర్‌గా జిల్లా స్థాయి అధికారిని నియమించాలని, అదనపు కలెక్టర్‌ జిల్లా నోడల్‌ అధికారిగా వ్యవహరించాలని, సర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన వారి వివరాలను సైతం సేకరించాలన్నారు. సర్వే బృందం ఇంటికి వచ్చిన సమయంలో కుటుంబ సభ్యులందరూ తమ ఆధా ర్, రేషన్‌ కార్డులతో పాటు ధరణి పాస్‌పుస్తకాలను సిద్ధంగా ఉంచేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు.

వివరాలు గోప్యంగా ఉంచాలి

ఎన్యుమరేటర్లు సర్వే ప్రధాన ఉద్దేశాన్ని ప్రజలకు వివరిస్తూ హుందాగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం విక్రమార్క అన్నారు. సేకరించిన వివరాలు గోప్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాచారాన్ని ఆన్‌లైన్‌ చేసేందుకు ఆపరేటర్లను నియమించాలని, తప్పులకు అవకాశం ఉండొద్దన్నారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌మహతో, ట్రెయినీ కలెక్టర్‌ సంకేత్‌ కుమార్, జెడ్పీ సీఈవో ఉష, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బ్రోకర్లను పోషించింది

బోధన్‌/బోధన్‌రూరల్‌/రెంజల్‌: రాష్ట్రాన్ని గతంలో పాలించిన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బ్రోకర్లను, మిల్లర్లను పెంచిపోషించిందని, ఫలితంగా ఎఫ్‌సీఐకి ప్రభు త్వం రూ.58వేల కోట్ల అప్పు అయ్యిందని మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి అన్నారు. పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో బోధన్‌ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ ఆవరణలో, ఐకేపీ, విండో ఆధ్వర్యంలో రెంజల్‌లో, బోధన్‌ మండలం పెగడాపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమమేధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో 300 వర కు రైస్‌మిల్లులు ఉండగా, ప్రస్తుతం 135 రైస్‌ మిల్లులకే ధాన్యం అ లాట్‌మెంట్‌ ఇస్తున్నామని, సీఎంఆర్‌ బకాయిపడిన రైస్‌మిల్లర్లను తిరస్కరించినట్లు తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు తమకు అనుకూలమైన మిల్లులకే అనుమతులు ఇవ్వడంతో ఎఫ్‌సీఐకి బియ్యం అందించకుండా అమ్ముకున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. రుణమాఫీ రైతులందరికీ వర్తిస్తుందని, ఆందోళన చెందొద్దని ఆయన సూచించారు. పందిరి సాగు ద్వారా కూరగాయలు సాగుచేసే రైతులకు 50 శాతం రాయితీపై విత్తనాలతోపాటు మందుల పిచికారీ కోసం డ్రోన్‌ లు అందిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పా ఠశాలల్లో చేర్పించాలని, నాణ్యమైన విద్యనందించడం తోపాటు ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్‌ అంకు సంధ్యాదామోదర్, వైస్‌ చైర్మన్‌ చీల శంకర్, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తూము పద్మశరత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌ ఉద్మీర్‌ లక్ష్మణ్, తహసీల్దార్లు విఠల్, సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



బోధన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజాంషుగర్స్‌కు త్వరలో ఇంజనీర్ల రాక

బోధన్‌: గత ప్రభుత్వం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కారణంగానే నిజాంషుగర్స్‌ మూతపడిందని మాజీ మంత్రి, ఎమ్మెలే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు తమ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తోందన్నారు. ఎన్డీఎస్‌ఎల్‌ను సుదర్శన్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఫ్యాక్టరీని సమర్థవంతంగా, లాభసాటిగా నడిపేందుకు సాధ్యాసాధ్యాల పరిశీలన కోసం త్వరలో ఇంజనీర్లు వస్తారన్నారు. ఇంజనీర్లు నివేదిక ఇచ్చిన తరువాత చెరుకు సాగుపై రైతులతో తాను మాట్లాడుతానన్నారు. ఈ ప్రక్రియ అనంతరం సీఎం రేవంత్‌ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రైతులు అధిక దిగుబడి వచ్చే చెరుకు వంగడాలను సాగు చేయాలన్నారు. ఆయనవెంట నిజాంషుగర్‌ లిమిటెడ్‌ అధికారి రమేశ్, కోర్‌ కమిటీ అధికారి విశ్వనాథ్, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ చీల శంకర్, తహసీల్దార్‌ విఠల్, టీపీసీసీ డెలిగేట్‌ బి గంగాశంకర్, నాయకులు నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్‌ తదితరులున్నారు.



షుగర్‌ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌ రెడ్డి

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్‌	99,408	1,14,170	06	2,13,584
బోధన్‌	1,07,153	1,17,677	05	2,24,835
బాన్సువాడ	94,312	1,03,652	14	1,97,978
నిజామాబాద్‌ అర్బన్‌	1,47,699	1,58,608	42	3,06,349
నిజామాబాద్‌ రూరల్‌	1,20,975	1,37,984	06	2,58,965
బాల్కొండ	1,05,620	1,22,981	04	2,28,605
మొత్తం	6,75,167	7,55,072	77	14,30,316

ఎన్‌ఆర్‌ ఐ ఓటర్లు 91 సర్వీస్‌ ఓటర్లు 830

నిజామాబాద్‌ అర్బన్‌: ఎస్‌ఎస్‌ఆర్‌–2025లో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా ఓటరు జాబితా ప్రతులను మంగళవారం అందజేశారు. ఈఆర్‌వో, ఏఈఆర్‌వో కార్యాలయాల్లోనూ డ్రాఫ్ట్‌ రోల్‌ను ప్రచురించినట్లు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే నవంబర్‌ 28తేదీ లోగా తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్‌ తదితరులు పాల్గొన్నారు.

వానర దండు కదిలింది



ఒక్కసారిగా దూసుకువచ్చిన వానర దండును చూసి బాల్కొండ మండల కేంద్రవాసులు బెంబేలెత్తారు. మంగళవారం సాయంత్రం కోతుల గుంపు ఆర్మూర్‌ గైని వైపు రావడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. కొద్దిసేపు ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయాయి. కోతుల నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు. – బాల్కొండ

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల మూడు, ఐదవ సెమిస్టర్(రెగ్యులర్), రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ 2020–23 బ్యాచ్ విద్యార్థులు థియరీ గ్జామ్స్ ఫీజు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కంట్రోలర్ అరుణ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 4వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ. 100 అపరాధ రుసుముతో నవంబర్ ఐదవ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మినీస్టేడియంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి ఆధ్వర్యంలో అండర్–14, 17 హాకీ బాల, బాలికల జిల్లా క్రీడాకారుల ఎంపికను మంగళవారం నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన అండర్–17 బాలబాలికల తుది జట్టును ఖరారు చేశారు. కార్యక్రమంలో పీడీ సదమస్తుల రమణ, పింజ సురేందర్, చిన్నయ్య, స్వామి, నాగేశ్, పీఈటీ శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14, 17 బాల,బాలికల విభాగాల్లో వెయ్యికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ చూపిన 72 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్ కుమార్, స్వామి గౌడ్, శ్రీనివాస్, నాగరాజు, శివ గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్‌గా సాయిబాబాగౌడ్



ఆర్మూర్: ఎట్టకేలకు ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. బీసీ జనరల్ రిజర్వేషన్‌తో చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్‌గా వితం జీవన్, 18 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాన్ని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. డైరెక్టర్లుగా సురకంటి చిన్న గంగారాం, కల్లూరి చిన్న పూశన్న, అజ్మీర్ పీర్‌సింగ్, కనక రవికుమార్, మట్ట అమృతరావు, మామిడి చంద్రశేఖర్‌రెడ్డి, సయ్యద్ ఫయాజ్, క్లాం మల్లారెడ్డి, పింజ ఉషారాణి, బూస మల్లయ్య, మొహమ్మద్ మీరొద్దీన్, ముత్యం సంతోష్‌తో పాటు పెర్మిట్ పీఏసీఎస్ చైర్మన్, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ డైరెక్టర్లుగా కొనసాగుతారు. అనంతరం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నూతన పాలకవర్గానికి నియామక ఉత్తర్వులను అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు



విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



కలెక్టరేట్‌కు వచ్చిన ముదిరాజ్ మహాసభ నాయకులు

బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ

నిజామాబాద్‌నాగారం: బీసీల సమస్యలు తెలుసుకోవడానికి జిల్లా కేంద్రానికి వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు మంగళవారం వివిధ కుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. చైర్మన్ నిరంజన్‌రెడ్డిని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెతుకు శివ కుమార్ ఆధ్వర్యంలో కలిసి సమస్యలను విన్నవించారు. అలాగే జిల్లా బీసీ ఉద్యోగుల సమస్యలను అధ్యక్షుడు కరిపె రవీందర్, కార్యదర్శి మంద చంద్రమోహన్, కోశాధికారి విఠల్ ప్రభాకర్, సభ్యులు వివరించారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సత్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సీతాపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరిపూర్ణాచారి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణాచారి విశ్వబ్రాహ్మణ సమాజ స్థితిగతులు, సమస్యలను కమిషన్‌కు వివరించారు. నాయీబ్రాహ్మణ సభ్యులు తమ సమస్యలను తెలిపి ఇతర మతస్తులు తమ షాపులు పెట్టుకోకుండా జీవో విడుదల



బీసీ కమిషన్ సభ్యులకు హారతితో స్వాగతం పలుకుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

చేయాలని కోరారు. ఆరెకటిక కులాలను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని నగర ఆరె కటిక సంఘం నాయకులు కోరారు.

బీసీ కమిషన్ సభ్యులకు ఘన స్వాగతం

జిల్లా కేంద్రానికి వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు హారతులతో స్వాగతం పలికారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రీలత, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ బీసీల సమస్యలను విన్నవించారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం నివేదిక బాగుంది

- సభ్యులను ప్రశంసించిన బీసీ కమిషన్

నిజామాబాద్‌నాగారం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అందించిన నివేదిక బాగుందని బీసీ కమిషన్ ప్రశంసించింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల దామాషా ఖరారుకు సంబంధించిన అంశంపై రాష్ట్ర బీసీ కమిషన్ మంగళవారం బహిరంగ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. విచారణలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ బీసీల అభ్యున్నతి, సంక్షేమంపై సమగ్ర నివేదికను బీసీ కమిషన్‌కు అందించారు. జిల్లాలో బీసీ భవన్ నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రెండెకరాల స్థలం కేటాయించి స్వంత భవనం నిర్మాణం చేయాలని, కాలేజీ హాస్టళ్ల సీట్లను రెట్టింపు చేయాలని, మహాత్మ జ్యోతిబా పూలే, చత్రపతి శివాజీ జయంతిలకు సెలవు దినం ప్రకటించాలని వినతిపత్రం అందించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ నివేదికను, సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు అందించిన సలహాలు, సూచనలను బీసీ కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. సంఘం నివేదికపై ప్రశంస లు కురిపించింది. ప్రస్తుత సమయంలో అతిపెద్ద బీసీ సంఘంగా గుర్తించబడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘంపై గురుతర బాధ్యత ఉందని గుర్తు చేసింది. బీసీ లెక్కలు తేలేలా సంఘం తరపున గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ సూచించారు. బీసీలు కులగణనలో పాల్గొనేలా చూడాలని, అప్పుడే సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, విద్య రంగాల్లో బీసీల వాటా పెరుగుతుందని



సభ్యులను ప్రశంసిస్తున్న బీసీ కమిషన్ సభ్యులు

చెప్పారు. కమిషన్‌కు వచ్చిన బీసీల లెక్కల ప్రకారమే తాము చర్యలు తీసుకోగలమనే విషయాన్ని బీసీలు గుర్తించాలన్నారు. అనంతరం బీసీ కమిషన్ సభ్యులైన రాపోలు జయ ప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మిలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏనుగందుల మురళీ, రేవంత్, బొబ్బిలి నర్సయ్య, లక్ష్మణరావు, గోవింద్ రాజు, సుభాష్, మండె మోహన్, ఆంజనేయులు, శివకుమార్, రఘురాం, అమంద్ ప్రవీణ్ కుమార్, నవాతే ప్రతాప్ పాల్గొన్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- నాలుగు నెలల్లో రెండు ఉద్యోగాలు సాధించిన యాదగిరి
- అనారోగ్యంతో మృతి



వరిగె యాదగిరి (ఫైల్)

నాగిరెడ్డిపేట: తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలని కష్టపడి చదివి కొలువు కొట్టాడు. అయితే ఆ ఆనందం అతడి కుటుంబంలో ఎంతోసేపు నిలవలేదు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.

మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన వరిగె యాదగిరి (30) చిన్నప్పుడు తండ్రి నర్సింలుతో కలిసి సైకిల్‌పై తిరుగుతూ డబల్‌రొట్టెలు అమ్మేవాడు. తర్వాత తండ్రి ఆటో నడపగా.. తల్లి బట్టలు కుట్టి కుటుంబానికి అండగా నిలిచారు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల కష్టం తెలిసిన యాదగిరి.. సర్కారు ఉద్యోగం సాధించాలన్న కసితో చదివాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం లింగంపేటలోని బీసీ గురుకుల పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం యాదగిరి డీఎస్సీ–2024లో స్కూల్ అసిస్టెంట్(మ్యాథమెటిక్స్)లో జిల్లా టాపర్‌గా నిలిచి.. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిక చేసుకున్నాడు. అయితే అనారోగ్యం కారణంగా పాఠశాలలో సెలవుపెట్టి ఆస్పత్రిలో చేరాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మంగళవారం యాదగిరి ఆత్మశాంతికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. యాదగిరితో కలిసి పనిచేసిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు మాసాన్‌పల్లికి తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. 9,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కాకతీయకాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, వరద కాలువ 4వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూ సెక్కుల నీటిని వినియోగిస్తుండగా, ఆవిరి రూపంలో 571 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

బాబ్లీ గేట్ల మూసివేత



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువన 80 కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మంగళవారం త్రిసభ్య కమిటీ పర్యవేక్షణలో మూసి వేశారు. ఉదయం 11 గంటల నుంచి క్రమంగా సాయంత్రం వరకు 14 గేట్లను కిందికి దించారు. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరదలకు బ్రేకు పడింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రతి సంవత్సరం జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తి, అక్టోబర్ 29న మూసి వేయాలి. పరిసర ప్రాంతాల్లో నిలిచిన నీటికి బదులుగా మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి ఎస్సారెస్పీకి 0.6 టీఎంసీల నీటిని వదలాలి. ఈ కార్యక్రమంలో తెలంగాణ తరపున ఎస్సారెస్పీ నుంచి ఎస్‌ఈ శ్రీనివాస్ రావు గుప్తా, ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈ గణేశ్, ఏఈఈ రవి, సీడబ్ల్యూసీ తరపునన ఈఈ వెంకటేశ్వర్లు, మహారాష్ట్ర తరుపున నాందెడ్ ఈఈ బన్సోద్, ఏపీ తరపున ఈఈ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం.. సత్వర పరిష్కారం

- జిల్లా జడ్జి సునీత కుంచాల



కమ్యూనిటీ మీడియేన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: కొలిక్కిరాని ఎన్నో సమస్యలు మధ్యవర్తిత్వంతో పరిష్కారమవుతాయని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. నగరంలోని ఓల్డ్ డీఈవో కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కొలిక్కిరాని కుటుంబ వివాదాలు, ఆస్తి పంపకాల్లో అన్నా చెల్లెల్ల మధ్య గొడవలు, రెండు సంస్థల వ్యాపార దేవీల్లో తగాదాలు, భార్యాభర్తల మనస్పర్ధలు ఇలా అనేక విషయాల్లో సత్వర పరిష్కారం దిశగా మధ్యవర్తిత్వ కేంద్రం పనిచేస్తుందని అన్నారు. గతంలో గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలు వస్తే గ్రామంలోని పెద్దలు సమక్షంలో పరిష్కరించుకునే వారని, ప్రస్తుతం అవి కనుమరుగయి పోవడంతో పోలీస్‌స్టేషన్, కోర్టులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. పీఎస్‌లో జాప్యం, కోర్టుల్లో ఎన్నో కేసులు ఉండడంతో చిన్న చిన్న సమస్యలు జాప్యంతో తొందరగా పరిష్కారం లభించడం లేదన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని గుర్తించి మధ్యవర్తిత్వ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం నాలుగు సెంటర్లను ఏర్పాటు చేశామని బోధన్, ఆర్మూర్, డీఎల్ఎస్ఏ, నాలుగవది ఓల్డ్ డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనిటీ మీడియా సెంటర్‌కు ముత్యాల రవీందర్, కుంచం శ్రీనివాస్, దేవ భక్తుని వాసుదేవరావు, లక్ష్మీపతి, ఎజాస్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతారని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, కోర్టు సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

మోపాల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర అండర్–14, 19 పోటీల ముగింపు కార్యక్రమాన్ని మండలంలోని కంజర్ బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, క్యారం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని బీసీ గురుకుల పాఠశాలల ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎల్లోల సాయిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గొర్కంటి లింగం, ప్రసాద్, ఉమ్మాజి నరేశ్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మురళీ, ఇన్‌చార్జి రంజిత్, పీఈటీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి జోనల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు



పచ్చలనడ్కుడ హైస్కూలులో క్రీడాకారులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఖోఖో జోనల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్–14, 17 బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించగా కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల పరిధిలోని 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జోనల్ జట్టుకు ఎంపిక చేశారు. క్రీడల జోనల్ కన్వీనర్ పసుపుల సాయన్న, వీడీసీ అధ్యక్షుడు బోగ రామస్వామి, బుచ్చిమల్లయ్య, పీడీలు వేముల నాగభూషణం, నగేశ్, మాధురి, జ్యోతి, రమేశ్, పీఈటీలు సంజీవ్, బాలు, సింధుజ పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడ హైస్కూలులో..

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాలలో భీమ్‌గల్ సబ్‌డివిజన్ అండర్–14, 17 ఖోఖో, వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. వేల్పూర్, భీమ్‌గల్ మండలాల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పచ్చలనడ్కుడ హైస్కూలు హెచ్‌ఎం రమేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రుద్రూర్: ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కోటగిరి మండల కేంద్రంలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో జోనల్ స్థాయి ఖోఖో అండర్–17 పోటీలకు క్రీడాకారులను మంగళవారం ఎంపిక చేశారు. ఇందులో రుద్రూర్, కోటగిరి, పోతంగల్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. నవంబర్1న ఆర్మూర్ డివిజన్ ఫత్తేపూర్‌లో నిర్వహించే ఖోఖో పోటీల్లో వీరు పాల్గొంటారని ఫిజికల్ డైరక్టర్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సంతోషిణి, ప్రతిభ, సంజీవ్, విశాల్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలి బ్యాగు నుంచి ఇద్దరు మహిళలు ఐదున్నర తులాల బంగారం చోరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఎస్‌హెచ్‌వో మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని దారుగల్లీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని ముంతాజ్‌బేగం పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి నిజామాబాద్‌కు ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఇద్దరు మహిళలు ఆమె పక్కన కూర్చున్నారు. వీరు స్థానిక రైల్వేస్టేషన్ వద్ద దిగారు. కొద్ది సేపటికి తన బ్యాగ్ తెరిచి ఉండటాన్ని గమనించిన ముంతాజ్‌బేగం అందులో ఉన్న ఐదున్నర తులాల బంగారం కనిపించలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

కత్తితో దాడి చేసిన నిందితుడి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలో దుబ్బ ఏరియాకు చెందిన విశ్వనాథ్‌పై కత్తితో దాడి చేసిన భాస్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్ తన స్నేహితుడైన భాస్కర్‌కి మూడు నెలల క్రితం రూ. 5వేలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని విశ్వనాథ్ పలుమార్లు భాస్కర్‌ని అడిగాడు. దీంతో విశ్వనాథ్‌ని చంపాలని నిర్ణయించుకున్న భాస్కర్ సోమవారం దుబ్బలోని శివాజీ చౌక్‌లో ఉన్న అతన్ని కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో దాడి చేశాడు. విశ్వనాథ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టౌన్ సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది నిందితుడిని రెండు గంటల్లో పట్టుకొని అరెస్టు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

బోధన్‌రూరల్: మండలంలోని ఎరాజ్‌పల్లి, ఊట్‌పల్లి శివారులో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఇందులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,800 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలీసు శ్రీనివాస్(43) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడిన ఘటనలో మరొకరు..

ఖలీల్‌వాడి: బైక్‌పై నుంచి పడిన ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన షేక్ యూసుఫ్, అవినాశ్ ఇద్దరు స్నేహితులు. ఈ నెల 25న వీరు బైక్‌పై అతివేగంగా ప్రయాణిస్తుండగా ఉమెన్స్ కాలేజ్ కంఠేశ్వర్ వద్ద కిందపడ్డారు. ఈ ఘటనలో షేక్ యూసుఫ్ తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఉదయం అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రిహాన బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



సిరికొండ: మండలంలోని న్యావనంది చౌరస్తా సమీపంలో మంగళవారం రెండు మినీ వ్యాన్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ తన మినీ వ్యాన్‌తో భీంగల్ వైపు వెళ్తున్నాడు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన నారాయణ భీంగల్ వైపు నుంచి సిరికొండకు మినీ వ్యాన్‌లో వస్తున్నాడు. న్యావనంది చౌరస్తా సమీపంలో ఎదురెదురుగా వ్యాన్లు ఢీకొనడంతో శ్రీనివాస్ కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నారాయణకు చెందిన వ్యాన్‌ను పీఎస్‌కు తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎల్ రామ్ తెలిపారు.

బాలకృష్ణ హత్యకేసులో అనుమానాలెన్నో?

- సుపారీ ఇచ్చి హత్య చేయించారా?
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు



మాచారెడ్డి పోలీస్‌స్టేషన్

మాచారెడ్డి: మండల కేంద్రానికి చెందిన దువ్వల బాలకృష్ణ(32) పాల్వంచ ఇసాయిపేట శివారులో సోమవారం రాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీంతో దర్యాప్తు మొదలు పెట్టారు. మంగళవారం ఉదయం మృతుడి భార్యతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాల వ్యాపారం చేసుకొని జీవించే బాలకృష్ణను కాపు కాసి పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని గ్రామస్తులు 'సాక్షి'కి వివరించారు. బాలకృష్ణ హత్య నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పలువురు మహిళా కానిస్టేబుళ్లతో పాటు పోలీస్ బలగాలను మోహరించారు.

ఎంపీ ఫొటో మార్ఫింగ్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు



ఎఫ్‌ఐఆర్ కాపీ తీసుకుంటున్న ఎంఐఎం నేతలు

ఖలీల్‌వాడి: ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫొటోను మార్ఫింగ్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీ అసదుద్దీన్ ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన నగరంలోని మాలపల్లికి చెందిన మాజీ కార్పొరేటర్ ఎంఏ ముఖీత్, ముంబైకి చెందిన సోషల్ మీడియా సంబంధించిన కలీమ్‌షేక్‌పై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫొటో మార్ఫింగ్‌పై ఒకటవ టౌన్ పీఎస్‌లో నగర ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, నగర కార్యదర్శి మహ్మద్ షెహబాబ్ అహ్మద్ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేస్తే ఊరుకోం

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తే ఊరుకోమని నగర ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, నగర కార్యదర్శి మహ్మద్ షెహబాబ్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఒకటవ టౌన్ పోలీసుల నుంచి ఎఫ్‌ఐఆర్ కాపీని అందుకున్న తర్వాత వారు విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ చిత్రాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశారని చెప్పారు. దీనిని వ్యతిరేకిస్తూ ఒకటో టౌన్ పీఎస్‌లో అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ముహమ్మద్ ఇద్రీస్ ఖాన్, ముహమ్మద్ ఫయాజుద్దీన్, మీర్ మజాజ్ అలీ తదితరులు ఉన్నారు.

గుట్కా ప్యాకెట్లు సీజ్

బోధన్‌రూరల్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సాలూర అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న తనిఖీలో మంగళవారం రూ.8వేలు విలువ గల గుట్కా ప్యాకెట్లు సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని బిలోలి గ్రామానికి చెందిన పాషా, చాంద్ అనే ఇద్దరు బస్సులో సాలూర నుంచి మహారాష్ట్ర వైపు గుట్కా ప్యాకెట్లను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లాడ్జిపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మారుతి లాడ్జిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10.30 గంటలకు ఇద్దరు వ్యక్తులు మారుతి లాడ్జిలోకి ప్రవేశించి ఓ వర్గానికి చెందిన వ్యక్తులకు ఎందుకు గదులు ఇస్తున్నారని మేనేజర్ లక్ష్మిపై దాడిచేసి కౌంటర్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సజీల్‌పాషా, ఇమ్రాన్‌బిన్‌అలీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్/ బోధన్‌రూరల్: పోతంగల్ మండలం కొడిచర్ల నుంచి సిరిపూర్ వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు తహసీల్దార్ మల్లయ్య మంగళవారం తెలిపారు. ట్రాక్టర్‌ను చెక్‌పోస్ట్ వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పట్టుకుని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సాలూర మండలంలోని ఖాజాపూర్, మందర్న శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.